క్లుప్తంగా

యోగా శిక్షకులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయవరం: మండలంలోని వెంటూరు ప్రభుత్వ హోమియో వైద్యశాలలోని ఆరోగ్య అవగాహన కేంద్రంలో యోగా శిక్షకులుగా పని చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు స్థానిక వైద్యాధికారి వీపీవీ లక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఆమె శుక్రవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. యోగా శిక్షకులుగా పనిచేసేందుకు ఆసక్తి గల వారు పీజీ యోగ లేదా యోగాలో డిప్లొమా అర్హతగా కలిగి ఉండాలన్నారు. విద్యార్హతలు ఉన్న వారికి తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. పురుష యోగా శిక్షకులు నెలకు 32 గంటలు, స్త్రీ యోగా శిక్షకులు నెలకు 20 గంటల వంతున పని చేయాల్సి ఉంటుందన్నారు. కాగా యోగా శిక్షకులుగా ఎంపికైన వారికి గంటకు రూ. 250ల వంతున గౌరవ వేతనం చెల్లిస్తామని తెలిపారు. ఆసక్తి అభ్యర్థులు దరఖాస్తులను వెంటూరు ప్రభుత్వ హోమియో ఆస్పత్రిలో సమర్పించాలని, మరిన్ని వివరాలకు 8106356444 నంబరుకు సంప్రదించాలన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ ప్రారంభం

రామచంద్రపురం: డీఎస్సీ, టెట్ అభ్యర్థులు ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచించారు. పట్టణంలోని వీఎస్ఎం కళాశాలలో మంత్రి సుభాష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అభ్యర్థులకు డీఎస్సీ మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రూ.2 లక్షలు, కేవీ ఆర్ హాస్పటల్ అధినేత డాక్టర్ కోట సతీష్ రూ.50 వేలు ఉచిత కోచింగ్ సెంటర్‌కు విరాళంగా అందించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, టీడీపీ పట్టణాధ్యక్షులు కె.రాఘవన్, మాజీ కౌన్సిలర్ దంగేటి గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధనలో ప్రకాశం పాత్ర కీలకం

రాయవరం: ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధనలో టంగుటూరి ప్రకాశం పంతులు కీలకపాత్ర పోషించారని ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఎంపీడీవో నరేంద్రరెడ్డి పేర్కొన్నారు. ప్రకాశం పంతులు 152వ జయంతిని శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ప్రకాశం పంతులు ఆంధ్ర రాష్ట్ర సాధనకు చేసిన కృషికి విజయవాడ బ్యారేజీకి ప్రకాశం బ్యారేజిగా, ఒంగోలు జిల్లాకు ప్రకాశం జిల్లాగా నామకరణం చేశారన్నారు. ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ పూజలు



ద్రాక్షారామలో వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో వేంచేసిన పర్వత వర్ధినీ సమేత సప్తకోటి రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద శుక్రవారం నిట్టల సత్యజోగారావు బ్రహ్మత్వంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన ఖజానా జ్యూయలర్స్ అధినేత దినేష్‌కుమార్, సంగీత దంపతులు సౌజన్యంతో ఏర్పాట్లు చేయగా 350 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొని వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు. గ్రామానికే చెందిన మరో దాత పూజల్లో పాల్గొన్న మహిళలకు జాకెట్టు ముక్కలు అందజేశారు.

కె.గంగవరం: మండలంలోని పామర్రులో కొలువైన ఉమాపార్వతీ సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. శ్రావణమాసంలో మూడో శుక్రవారం కావడంతో అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. వేదపండితులు యనమండ్ర సాంబశివ అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పూజలకు హాజరైన మహిళలకు యండగండి గ్రామానికి చెందిన టీడీపీ నేత చౌదరి వెండి వరలక్ష్మీ రూపులు ఉచితంగా అందించారు.

కాజులూరు: శ్రావణమాసంలో మూడో శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. పలు గ్రామాల్లోని ఆలయాల వద్ద సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

ఎరువుల వినియోగంపై శ్రద్ధ వహించాలి

కాజులూరు: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఎరువులు, పురుగు మందులు వినియోగించే సమయంలో తగిన శ్రద్ధ వహించాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ సూచించారు. మండలంలోని శీల గ్రామంలో రైతులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. రైతులకు ఎరువులు, పురుగు మందులు వినియోగంపై అవగాహన కల్పించారు. పురుగు మందులు వినియోగించే సమయంలో రైతులు తప్పని సరిగా చేతికి గ్లౌజులు, ముఖానికి మాస్కులు ధరించాలని సూచించారు.



రక్షణ చర్యలు చేపట్టాలి

ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో సేవలందిస్తున్న వైద్యులు, సిబ్బందికి పూర్తి రక్షణ చర్యలు చేపట్టాలి. చదువుకున్న రోజుల్లో పేదలకు వైద్య సేవలందించి జీవితాన్ని సార్థకం చేసుకోవాలని ఆశించాం. అదే రీతిలో పయనిస్తున్నాం. కోల్‌కత్తాలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన హత్యాచారం నా మనస్సును కలచి వేసింది. ఈ ఘటనపై స్థానిక మీడియా, పలు ప్రజా సంఘాలు స్పందించి వైద్యులు వెంట నిలబడడం మనోధైర్యాన్ని ఇచ్చింది. రోగులకు సేవలు అందించే నర్సులను చులకనగా చూస్తున్న పరిస్థితులను నేను గమనించాను. వారి సేవలను మానవతా దృక్పథంతో అవగాహన చేసుకుంటే నర్సులో మదర్ థెరిసా కనిపిస్తుంది.

-డాక్టర్ పీఎస్ఎస్‌డీ రత్నకుమారి, వైద్యాధికారి, అంగర పీహెచ్‌సీ, కపిలేశ్వరపురం మండలం





నైట్ వాచ్‌మన్‌లను నియమించాలి

పలు పీహెచ్‌సీల్లో నైట్ వాచ్‌మన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో రాత్రి సమయాల్లో ఒక్కరు మాత్రమే డ్యూటీ చేసే స్టాఫ్ నర్సులు భయపడుతూ విధులు నిర్వర్తించవలసి వస్తోంది. పలువురు తరచూ మద్యం సేవించి ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చి వైద్యులను ఇబ్బంది పెడుతున్నారు. పగటి పూట ఇటువంటి పరిస్థితి తలెత్తినప్పుడు సిబ్బంది, ఇతర పేషెంట్లు ఉంటారు కాబట్టి ధైర్యంగా ఉండొచ్చు. కానీ రాత్రి సమయాల్లో డ్యూటీ చేసే స్టాఫ్ నర్సులు చాలా భయపడాల్సి వస్తోంది. ఆసుపత్రుల్లో నైట్ వాచ్‌మన్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.

- డాక్టర్ ఎన్.ప్రశాంతి, డివిజనల్ మెడికల్ ఆఫీసర్, రామచంద్రపురం

నీరు అందదు.. సాగు సాగదు

- అధ్వానంగా పంట కాలువలు
- శివారు పొలాలకు అందని సాగునీరు
- పొలాలు బీటలు వారి, ఎండిపోతున్న పంటలు
- పట్టించుకోని అధికారులు



కుడుపూరులో బీడుబారిన పంట పొలాలను చూపిస్తున్న రైతులు

కె.గంగవరం: గోదావరి చెంతనే ఉన్నా.. పంట పొలాలకు మాత్రం సాగునీరు అందడం లేదు. వరి ప్రధాన పంటగా పండిస్తున్న రైతులు, కౌలుదారులు ప్రస్తుతం సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన చెందుతున్నారు. కేవలం ప్రధాన పంట కాలువల నుంచి చిన్న పంట బోదెల్లో సాగునీరు సక్రమంగా వెళ్లకపోవడంతో శివల, దంగేరు, కుడుపూరు, గుడిగళ్లబాగ గ్రామాల్లోని పంటలు బీటలుగా మారుతున్నాయి. దీనికి తోడు ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వాతావరణ మార్పుల కారణంగా వర్షాలు పడకపోవడం, వేసవిని తలపించేలా ఎండలు కాయడంతో వరి పంట పొలాలకు ఇబ్బందిగా మారింది. మండలంలోని పలు గ్రామాల్లో పొలాలకు నీరు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.

మండల పరిధిలోని యర్రపోతవరం- కాజులూరు ప్రధాన పంట కాలువ నుంచి శివల గ్రామం ద్వారా దంగేరు, కుడుపూరు, గుడిగళ్లబాగతో పాటు శివారు గ్రామాలకు చిన్న పంట బోదెల ద్వారా నీరు అందుతోంది. చిన్న పంట బోదెల్లో సాగునీరు సక్రమం పారడం లేదని, దిగువకు వెళ్లాల్సిన నీరు ఎగువకు వెళ్తుందని రైతులు చెబుతున్నారు. పంట బోదెల్లో పూడిక, గుర్రపుడెక్క తొలగించకపోవడంతో పాటు గట్లకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు, గడ్డి పేరుకుపోవడంతో సాగునీరు దిగువ పొలాలకు వెళ్లడం లేదని రైతులు వాపోతున్నారు. పంట కాలువల్లో పూడికతీతకు ఇరిగేషన్‌శాఖ ద్వారా కాంట్రాక్టు దక్కించుకున్న వారు తూతూమంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకోవడంతో పంట బోదెలు అధ్వాన్నంగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. ఇరిగేషన్, డ్రైనేజీ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే సమస్య తలెత్తుతోందని రైతులు ఆరోపిస్తున్నారు.

పొలాలు ఎండిపోతున్నాయి



సాగునీరు అందక పంట పొలాలు ఎండిపోతున్నాయి. శివారు భూములకు సాగునీరు అందడం లేదని పలుమార్లు ఇరిగేషన్ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. పొలాల వద్ద రైతులు లేని సమయంలో వచ్చి తూతూమంత్రంగా గడ్డి మందు పిచికారీ చేసి వెళ్లిపోతున్నారు. దీంతో సమస్య పరిష్కారం కావడం లేదు.

– పెద్దిరెడ్డి వెంకటరమణ, రైతు, కుడుపూరు

అధికారులు స్పందించాలి



తొలకరి పంట బాగా పండాలంటే పొలాలకు సక్రమంగా నీరు అందాలి. అధికారులు రైతుల ఇబ్బందులను గుర్తించి పంట కాలువల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి. ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని ప్రభుత్వం గొప్పలు చెబుతుంది తప్ప ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదు.

– గుబ్బల సత్యనారాయణ, రైతు, కుడుపూరు సావరం

బోదెల నిర్వహణ బాధ్యత రైతులకు అప్పగిస్తే...

పంటలు సాగు చేస్తున్న రైతులకు పంట బోదెల నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తే పరిస్థితి మెరుగుపడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. పంట బోదెలను స్థానిక రైతులు బాగు చేసుకోవడం వల్ల శివారు పంట భూములకు నీరు సక్రమంగా అందుతుందని, కాంట్రాక్టర్లకు అప్పగిస్తే పరిస్థితి మరింత దిగజారి పంటలు పండే పరిస్థితి ఉండదని రైతులు చెబుతున్నారు.



దంగేరు శివారు కుడుపూరు సావరంలో ఎండిపోతున్న పంట పొలాలు

ఆదుకోని ప్రభుత్వం

రైతులకు అన్నివిధాలా అండగా ఉంటామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఎన్నికల్లో గెలిచాక తమను పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. దళారులు, తెలిసిన వారి వద్ద అప్పులు చేసి పంటలు వేశామని, ఇప్పటివరకూ ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏటా సీజన్ ప్రారంభంలోనే పెట్టుబడి సాయం అందించడాన్ని రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

పనులు త్వరగా గుర్తించి పూర్తి చేయండి



ఏడిద గ్రామ సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట: ప్రతి గ్రామంలోనూ ముఖ్యమైన ఉపాధి పనులను గుర్తించి, పూర్తి చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సూచించారు. మండలంలోని ఏడిద గ్రామంలో సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన ఉపాధి హామీ పనుల గుర్తింపు కోసం నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాల పనులను మొదలు పెట్టాలన్నారు. ఏడిద పంచాయతీలో రూ.1.48 కోట్లతో ఉపాధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు పంచాయతీ కార్యదర్శి వుండమట్ల వీర్రాజు తెలిఆరు. మండలంలో 1103 ఉపాధి పనుల కోసం రూ.12.14 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు ఎంపీడీవో సత్యనారాయణమూర్తి తెలిపారు.

కపిలేశ్వరపురం: ఉపాధి హామీ పథకంలో చేపట్టదలచిన పనులను గుర్తించడంలో ప్రజల భాగస్వామ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు మండల ప్రత్యేకాధికారి ఎ.శాంతి అన్నారు. మండలంలోని 19 గ్రామాల పంచాయతీ కార్యాలయాలు వద్ద శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. ఎంపీడీఓ కొండలరావు, తహసీల్దార్ చిన్నారావు పర్యవేక్షణలో గ్రామసభలు జరిగాయి. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఉపాధి హామీ పథకం అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రజల నుంచి పనులపై ప్రతిపాదనలను స్వీకరించారు.

తూతూమంత్రంగా గ్రామ సభలు

కె.గంగవరం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టనున్న పనులను గుర్తించేందుకు శుక్రవారం మండలవ్యాప్తంగా అన్ని పంచాయితీల వద్ద నిర్వహించిన గ్రామ సభలు తూతూ మంత్రంగా సాగాయి. ఏటా మాదిరిగానే ఇప్పుడు కూడా గతేడాది నిర్వహించిన పనులు, ఈ ఏడాది గుర్తించాల్సిన పనులను ఉపాధి హామీ సిబ్బంది ప్రజలకు వివరించారు. కాగా ముందురోజే గ్రామాల్లోని ప్రజలకు నూతన డ్రైనేజీలు, సీసీ రోడ్లు, పింఛన్లు కావల్సిన వారు సభకు రావాలని దండోరా వేయించారు. ప్రచార ఆర్భాటం కోసం పంచాయితీ నిధులతో టెంట్లు, మైక్ సెట్లు వేసి సభలు నిర్వహించారు. గ్రామాల్లోని వృద్ధులు, ఆశా వర్కర్లు, యానిమేటర్లు, అంగన్‌వాడీ సిబ్బంది మాత్రమే సభలకు తరలివచ్చారు. ఉపాధి సిబ్బందితో చేయాల్సిన పనులను చెప్పించిన అనంతరం ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో గ్రామంలో వేయాల్సిన రోడ్లు, డ్రైనేజీల వివరాలను సభల్లో వివరించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



గ్రామ సభలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం రూరల్: గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మండలంలోని ద్రాక్షారామలో శుక్రవారం నిర్వహించిన ఉపాధి హామీ గ్రామ సభలో మంత్రి సుభాష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో తరచూ తాగి పడేసిన మద్యం సీసాలు చూస్తున్నామన్నారు. ఇది సమీపంలోని ఆటో, ట్యాక్సీ స్టాండ్ డ్రైవర్ల పనిగా తనకు సమాచారం ఉందన్నారు. మరోసారి ఆలయ ప్రాంగణంలో మద్యం సీసాలు కనిపిస్తే ఆటో, ట్యాక్సీ స్టాండ్లు ఉండవని మంత్రి హెచ్చరించారు. గ్రామ సభలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, టీడీపీ నేత పెంకే సాంబశివరావు మాట్లాడారు. గ్రామ ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా(బాబ్జీ), వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అమాత్యా..ఆదుకోండి..

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ మండాలమ్మపేటకు చెందిన కనికెళ్ల సావిత్రి తన నాలుగేళ్ల మానసికంగా ఎదుగుదల లేని కుమారుడు కనికెళ్ల దుర్గాప్రసాద్‌ను ఎత్తుకుని శుక్రవారం నిర్వహించిన ఉపాధి హామీ గ్రామసభకు వచ్చింది. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నామని, తమను ఆదుకోవాలని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆమె కోరింది. మానసిక వికలాంగుడైన తన కుమారుడికి సదరం సర్టిఫికెట్ ఇప్పించాలని కోరగా దీనిపై మంత్రి సుభాష్ స్పందించి దుర్గాప్రసాద్‌కు సదరం సర్టిఫికెట్ వచ్చేలా చూడాలని పంచాయతీ కార్యదర్శి వలివేటి సూర్యసుబ్రహ్మణ్యానికి సూచించారు.

ఆక్రమణలు తొలగించాలని మంత్రికి వినతి

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో శుక్రవారం నిర్వహించిన ఉపాధి హామీ గ్రామ సభలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గ్రామంలోని ఆక్రమణలు తొలగించాలని కోరుతూ మంత్రికి వినతి పత్రం అందజేశారు.

కోల్‌కతా ఘటనకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ముస్లిం మహిళలు



రామచంద్రపురంలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న యువత

రామచంద్రపురం: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ శుక్రవారం రామచంద్రపురం పట్టణంలో ది కెప్టెన్ జిమ్ ఆధ్వర్యంలో యువత కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ఘటనకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన శిక్షలు అమలు చేయాలని, ప్రభుత్వం స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. మహిళలపై దాడులు జరిగినప్పుడు కాకుండా ఇలాంటి సంఘటన జరగకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాలని, మహిళా డాక్టర్లకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. ది కెప్టెన్ జిమ్ నిర్వాహకులు పలివెల సతీష్ మోహన్, బిందుమాధవి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీలకు రక్షణ కల్పించాలంటూ ముస్లిం మహిళల ర్యాలీ

మండపేట: మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ జమాతె ఇస్లామీ హింద్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆ సంస్థ పట్టణ శాఖ అధ్యక్షుడు అబుల్ అలా నేతృత్వంలో ప్ల కార్డులతో స్థానిక గాంధీనగర్ మసీదు సెంటర్ నుంచి ర్యాలీ ప్రారంభమైంది. బస్‌స్టాండ్, వాణీమహల్ జంక్షన్‌ల మీదుగా కలువపువ్వు సెంటర్ వరకూ ప్రదర్శన సాగింది. కలువ పువ్వు సెంటర్లో నిర్వహించిన సభలో వక్తలు జమాతె ఇస్లామీ హింద్ టౌన్ అధ్యక్షురాలు అబిదా సల్తానా, సీఐటీయూ నాయకురాలు కె. కృష్ణవేణి, 27వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ నీలం దుర్గమ్మ ప్రసంగిస్తూ మహిళలపై రోజు రోజుకూ హత్యాచారాలు పెరిగిపోతున్నాయన్నారు. మహిళ ల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని కోరారు. జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర కార్యదర్శి ఆయిషా, ముస్లిం మహిళలు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

జగ్గంపేట: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ముగ్గురు వ్యక్తులకు ఒక్కక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా, ఒక వ్యక్తికి మూడు రోజులు జైలు శిక్షను కోర్టు విధించినట్టు స్థానిక ఎస్సై రఘునాథరావు తెలిపారు. జగ్గంపేట పరిసర ప్రాంతాల్లో గురువారం డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా నలుగురు పట్టుబడ్డారు. వీరిని పోలీసులు శుక్రవారం పెద్దాపురం కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి రూ.10 వేలు చొప్పున ముగ్గురికి జరిమానా, ఒక వ్యక్తికి మూడు రోజులు జైలు శిక్ష విధించినట్లు చెప్పారు.మద్యం తాగి వాహనాలు నడపవద్దని సూచించారు.

కళాశాల విద్య నుంచే శాస్త్రీయ దృక్పథం

- అంతర్జాతీయ శాస్త్రవేత్తల సూచన
- మండపేట డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు
- శాస్త్రవేత్తలతో విద్యార్థులు మమేకం
- ముగింపు సందర్భంగా విద్యార్థులకు కర్తవ్యబోధ



సదస్సుకు హాజరైన శాస్త్రవేత్తలతో ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాసరావు



సదస్సులో ప్రసంగాలను వింటున్న విద్యార్థులు

కపిలేశ్వరపురం: ఆది మానవుడి నుంచి ఆధునిక మానవుడి వరకూ వరకూ పెరిగిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం వెనుక మనిషి శ్రమ దాగి ఉంది. రోజు రోజుకూ ఆవిష్కృతమవుతున్న నూతన సాంకేతికత మానవ సమాజ సమూహ కృషి ఫలితం. ప్రపంచం నలుమూలలా ఉనికిలో ఉన్న విజ్ఞానాన్ని పొందడం ద్వారా భవిష్యత్ తరాలు మానవ సమాజాన్ని మరింత వృద్ధి చేయగలుగుతారు. మండపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగాల ఆధ్వర్యంలో గురువారం ప్రారంభమైన అంతర్జాతీయ సదస్సు రెండో రోజైన శుక్రవారం ముగిసింది. సైన్స్‌లోని పలు విభాగాల్లో నూతన ఆవిష్కరణలను విద్యార్థులకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతుల్లో వివరించారు. దక్షిణ కొరియా, న్యూయార్క్ వంటి విదేశీ, ఢిల్లీ, తదితర స్వదేశీ శాస్త్రవేత్తలు కళాశాలలో నిర్వహించిన సదస్సులో తమ పరిశోధనల సారాంశాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. స్మార్ట్ మెటీరియల్స్, అండ్ అడ్వాన్స్‌డ్ అప్లికేషన్స్ – 2024 పేరుతో నిర్వహించిన సదస్సులో శాస్త్రవేత్తలు, నిర్వాహకులు, విద్యార్థుల అభిప్రాయాలు వారి మాటల్లోనే...

ఫోరెన్సిక్ విభాగం పట్ల అవగాహన అవసరం



నేడు ఫోరెన్సిక్ విభాగంలో అధునాతన ఆవిష్కరణలు జరుగుతున్నాయి. ప్రపంచీకరణ నేపధ్యంలో మానవుల మధ్య అవినాభావ సంబంధాలు సైతం పెరుగుతున్నాయి. పరిస్థితులు వికటించినపుడు సంబంధాలు దెబ్బతినడంతో పాటు నేరాలకు దారి తీస్తున్నాయి. ఫోరెన్సిక్ విభాగం నేరాల గుట్టును రట్టు చేయడంలో కీలకంగా వ్యవహరిస్తోంది.

–డాక్టర్ అక్కినాపల్లి భార్గవ్, ఇంటర్నేషనల్ రీసెర్చ్ ప్రొఫెసర్, యాంగనం యూనివర్శిటీ, దక్షిణ కొరియా

అవగాహన స్థాయి పెంచుకోవాలి



కాలంతో పాటు విద్యార్థులు తమ అవగాహన స్థాయిని సైతం పెంచుకోవాలి. అందుకోసం ఆధునిక కాలంలో స్మార్ట్ మెటీరియల్ ప్రాధాన్యతను గుర్తించాలి. మారుతున్న ప్రపంచంలో ముందువరుసలో ఉండేందుకు ఇష్టపడాలి. ఆ దిశగా కళాశాల విద్య అభ్యసిస్తున్నపుడే చొరవ చూపాలి.

–డాక్టర్ జి.హేమలత, ప్రొఫెసర్ అండ్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్, ఫిజిక్స్, ఎన్ఐటీ, తిరుచునాపల్లి

సత్ఫలితాలు ఇచ్చిన సదస్సు



రెండు రోజుల పాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు సత్ఫలితాలు ఇచ్చింది. అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాలు, శాస్త్ర, సాంకేతిక విభాగాల్లో ఆవిష్కృతమవుతున్న నైపుణ్యతలను విద్యార్థులకు చక్కగా వివరించారు. విద్యార్థులు సదస్సు సారాంశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత మార్గాన పయనించాలని ఆశిస్తున్నాను.

–డాక్టర్ టీకేవీ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మండపేట

సమన్వయంతో ముందుకు సాగాలి



శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికపుడు పెంచుకునే దిశగా అధ్యాపకులు, విద్యార్థులు సమన్వయంతో కృషి చేయాలి. సామాజిక అంశాలను అధ్యయనం చేస్తూ, వాటిని శాస్త్రీయ కోణంలో పరిశోధించాలి. ఆ దిశగా కృషి చేయడం ద్వారా విద్యార్థులు కచ్చితంగా ఉన్నత శిఖరాలను అధిరోహించగలరు.

–ఎ.ఆనందరావు, వైస్ ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మండపేట

భావితరాలకు దిక్సూచిగా సదస్సు



మండపేట డిగ్రీ కళాశాల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అంతర్జాతీయ స్థాయి సదస్సు నిర్వహించడం గర్వించదగినది. సదస్సులో చర్చించిన అంశాలు భావిభారత తరాలకు దిక్సూచిగా నిలవగలుగుతాయి. సదస్సులో అందించిన సావనీర్‌ను అధ్యయనం చేయాల్సిన అవసరాన్ని విద్యార్థులు గుర్తించాలి.

–ఎస్‌వీఎస్ కిరణ్‌కుమార్, కో –ఆర్డినేటర్, ఐసీఎస్ఎంఎ ప్రోగ్రాం, డిగ్రీ కాలేజి, మండపేట

ప్రభుత్వ కళాశాల ప్రతిష్ట పెంచింది



ప్రభుత్వ కళాశాలలను సహజంగా తీసికట్టుగా చూడడం సమాజంలో ఉంది. మండపేట చరిత్రలో అంతర్జాతీయ స్థాయిలో సదస్సు నిర్వహించడం ద్వారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రతిష్ట ఎన్నో రెట్లు పెరిగింది. సదస్సులో చర్చించిన అంశాలు మా అవగాహనను పెంచాయి.

– కె.సాయిరామ్, ఫైనల్ బీఎస్సీ విద్యార్థి, డిగ్రీ కళాశాల, మండపేట

శాస్త్రవేత్తలతో మమేకం కాగలిగాం



శాస్త్రవేత్తలు అగానే సామాన్యులకు అందుబాటులో ఉండరు అకునేదాన్ని, యూనివర్శిటీలు, పరిశోధనా సంస్థల్లో ఉంటారని వినేదాన్ని. అలాంటిది. దేశ, విదేశాల శాస్త్రవేత్తలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వచ్చి ఉపన్యాసాలు ఇవ్వడం ఆశ్చర్యాన్ని కలిగించింది. నాతోబాటు సహ విద్యార్థులంతా గర్వంగా భావిస్తున్నాం.

–బి.గౌతమి, ఫైనల్ బీఎస్సీ విద్యార్థిని, డిగ్రీ కళాశాల, మండపేట

ఆర్ట్స్ విద్యార్థులకు సైతం ఉత్తేజాన్నిచ్చింది



అంతర్జాతీయ సదస్సు ఆర్ట్స్ విద్యార్థులకు సైతం ఉత్తేజాన్ని ఇచ్చింది. శాస్త్రవేత్తలతో మాట్లాడినపుడు వారు చెప్పిన విషయాలు కేవలం సైన్స్ సంబంధించినవి గానే కాకుండా సామాజిక అంశాలుగా అనిపించాయి. వారు చెప్పిన విషయాలు ప్రతి ఒక్కరూ విధిగా తెలుసుకోవాల్సినవిగా అనిపించింది.

–అధికారి భవాని, సెకండ్ బీఏ, డిగ్రీ కళాశాల, మండపేట